సాక్షి
శ్రీకాకుళం
సోమవారం, 24, ఫిబ్రవరి, 2025



సూదికొండలో ఉద్రిక్తత

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ నూదికొండలో ఆక్రమణల తొలగింపు ఆదివారం ఉద్రిక్తతకు దారి తీసింది. స్థానికులు రెవెన్యూ అధికారుల తీరును తప్పు పట్టారు. తమ పునాదులు తొలగించవద్దని వేడుకున్నారు. కానీ అధికారులు పునాదులు తొలగించడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు.

ఉపాధ్యాయునిపై కేసు నమోదు

నందిగాం: మండలంలోని దేవుపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినితో అనుచితంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు కొండాల గోపాలంపై పలు కేసులు నమోదు చేశారు. విద్యార్థిని తల్లి దనసరి నీరజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి గోపాలాన్ని శనివారం రాత్రి తమ అదుపులోకి తీసుకున్నారు. టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి దేవుపురంలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు, నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉత్కంఠభరితంగా చదరంగం పోటీలు



టెక్కలిలో ఉత్కంఠభరితంగా చదరంగం పోటీలు

టెక్కలి: చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలి ఓక్లాండ్ పాఠశాలలో నిర్వహించిన అండర్-15 చదరంగం పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. ఇండియా చెస్ ఇన్ స్కూల్స్ ట్రైనర్ ఎస్.భీమారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పలాసకు చెందిన కె.కల్పక్ ప్రథమ స్థానంలో నిలిచాడు. శ్రీకాకుళానికి చెందిన బి.కార్తికేయ ద్వితీయ స్థానంలో నిలిచాడు. మూడో స్థానంలో బి.యశ్వంత్, నాల్గో స్థానంలో బి.జీవన్ విజయం సాధించారు. జూనియర్స్ విభాగంలో పలాసకు చెందిన కె.లిపిక, టెక్కలికి చెందిన ఎస్.రిత్విక్‌సాయి, కె.రాహుల్ విజయం సాధించారు. విజేతలకు నాయకులు బి.శేషగిరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

120 కిలోల నాగాభరణం తయారు



నాగాభరణంతో తయారీ దారులు

సారవకోట: మండలంలోని బుడితి కంచు, ఇత్తడి కార్మికులు నెల రోజులు శ్రమించి 120 కిలోల నాగాభరణం తయారు చేశారు. జలుమూరు మండలంలోని పాగోడు సమీపంలోని కొత్తూరు గ్రామంలో గల శివాలయం శిఖరం పై శివలింగం ఏర్పాటు చేసేందుకు ఆ గ్రామస్తులు దీన్ని తయారు చేయించారు. బుడితి గ్రామానికి చెందిన అద్దాల రామకృష్ణ, సూర్యకళలు సుమారు నెల రోజులు పాటు శ్రమించి 120 కిలోల ఇత్తడితో తయారు చేశారు.

చింతాడను అడ్డుకోవడం అమానుషం



దుంపల లక్ష్మణరావు

పొందూరు: బొడ్డేపల్లి, నెల్లిమెట్ట గ్రామాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక ర్యాంపులను పరిశీలించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గం ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ను టీడీపీ గూండాలు అడ్డుకోవడం అమానుషమని వైఎస్సార్‌సీపీ కళింగ సామాజిక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల లక్ష్మణరావు(రామారావు) అన్నారు. ఇలాంటి దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. చవకబారు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్సుగా టీడీపీ మారిందని దుయ్యబట్టారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం, అధికార యంత్రాంగం రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన వాసుదేవుని బ్రహ్మోత్సవాలు



మందసలోని వాసుదేవుని బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అశేష భక్త జనావళి మధ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు కూర్మచార్యులు పర్యవేక్షణలో రథోత్సవం జరిగింది. అలాగే చక్రతీర్థ స్నానం కూడా వైభవంగా నిర్వహించారు.

– కాశీబుగ్గ

వాయిదా వేస్తే బాగుండేది



గ్రూప్-2 పరీక్ష వాయిదా వేస్తేనే బాగుండేది. అత్యవసరంగా పరీక్ష నిర్వహించడం వల్ల ప్రిపరేషన్‌తో పాటు పరీక్ష రాసేందుకు కూడా ఇబ్బంది తప్పలేదు.

– పీవీ సాయి, మెళియాపుట్టి

పునరాలోచన చేయాలి



గ్రూప్-2 పరీక్షల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలి. ఇదివరకు పరీక్షలు వాయిదా వేస్తామని ప్రకటించిన ప్రభుత్వ పెద్దలు అత్యవసరంగా నిర్వహించడం దారుణం.

– వి.సతీష్‌కుమార్, శ్రీకాకుళం

మేమూ ధర్నాలు చేశాం



గ్రూప్-2 పరీక్షల వాయిదా కోసం ఉత్తరాంధ్రలో పెద్ద ఎత్తున ధర్నాలు చేశాం. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వాలు స్పందిస్తేనే నిరుద్యోగులకు మేలు జరుగుతుంది.

– జి.కల్పన, శ్రీకాకుళం

అందరూ వాయిదా కోరారు



అభ్యర్థుల్లో ఎక్కువ మంది పరీక్ష వాయిదా వేయాలని కోరారు. రోస్టర్ లోపాలు సరిచేసి, ఖాళీలకు అనుగుణంగా పోస్టులు పెంచి పరీక్షలు నిర్వహించాల్సింది. అభ్యర్థుల సమస్యను పట్టించుకోవాల్సిన అవసరం ప్రభుత్వం పై ఉంది.

– సిద్ధూ, అభ్యర్థి

విషమ పరీక్ష

ఎన్నో ఏళ్ల శ్రమ.. అనేక ఏళ్ల కల. సరిగ్గా కీలకమైన పరీక్ష రాసే సమయానికి సర్కారు పుణ్యమా అని అభ్యర్థులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాల్సింది పోయి హడావుడిగా.. కంగారు కంగారుగా పరీక్ష రాశారు. చాలా మంది అభ్యర్థులు పరీక్ష వాయిదా వేస్తారేమోనని చివరి నిమిషం వరకు ఎదురు చూశారు. కట్టుదిట్టంగా ఖాళీల పర్యవేక్షణ నడుమ పరీక్ష సజావుగా జరిగినా.. అభ్యర్థులు మాత్రం ఆవేదనతోనే హాజరయ్యారు. మొత్తానికి గ్రూప్-2 అభ్యర్థులకు విషమ పరీక్ష పెట్టింది.



శ్రీకాకుళం కాకినాడ ఆదిత్య కాలేజీ వద్ద కేంద్రం లోపలకు వెళ్తున్న అభ్యర్థులు



శ్రీకాకుళంలో పరీక్ష కేంద్రం లోపలకు వెళ్తున్న దివ్యాంగుడు



కాకినాడ కాలేజీ వద్ద అభ్యర్థి తనిఖీ

- పరీక్ష ప్రశాంతం.. అభ్యర్థుల కష్టాలు అనంతం
- పటిష్ట బందోబస్తు నడుమ గ్రూప్-2 మెయిన్స్ పూర్తి
- పరీక్ష వాయిదా వేస్తారేమోనని ఆఖరి నిమిషం వరకు అభ్యర్థుల ఎదురుచూపు
- ఆవేదనతోనే పరీక్షలకు హాజరైన నిరుద్యోగులు
- జిల్లాలో 15 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- ఉదయం సెషన్‌కు 85.18%, మధ్యాహ్నం సెషన్‌కు 84.99% హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ, ఎచ్చెర్ల క్యాంపస్, శ్రీకాకుళం పీఎన్ కాలనీ, శ్రీకాకుళం రూరల్:

జిల్లాలో ఆదివారం జరిగిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష పోలీసుల కాపలా నడుమ సాగింది. రోస్టర్ విధానంలో సవరింపులు చేసి పరీక్షను నిర్వహించాలని రాష్ట్రవ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి వరకు అభ్యర్థులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. శ్రీకాకుళంలో సైతం అభ్యర్థులు సామాజిక మాధ్యమాల్లో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరీక్షను వాయిదా వేస్తుందేమోనని ఆఖరి నిమిషం వరకు ఎదురుచూసిన అభ్యర్థులకు నిరాశ తప్పలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు హాజరుకావాల్సి వచ్చింది. రోస్టర్ విధానంలో సవరింపులు చేసే వరకు పరీక్షను వాయిదా వేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ.. కనీసం ఆ దిశగా కూటమి ప్రభుత్వం ఆలోచన చేయకపోవడాన్ని అభ్యర్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్ అభ్యర్థుల కోసం ఆఖరి నిమిషం ఎన్నో ఎత్తుగడలు, డ్రామాలు ఆడి పరీక్షను యథాతథంగా నిర్వహించేలా తెరవెనుక కుట్ర చేశారని అభ్యర్థులు గుర్తించారు. నెపాన్ని ఏపీపీఎస్సీపైకి నెట్టేయడంతో అభ్యర్థులు నిలువునా మోసపోయారు.



ఎచ్చెర్ల క్యాంపస్: వెంకటేశ్వర పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఆర్డీఓ సాయిప్రత్యూష

ఉదయం.. మధ్యాహ్నం

జిల్లాలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహణకు 15 కేంద్రాలను కేటాయించారు. శ్రీకాకుళం మండలం పరిధిలో 8, ఎచ్చెర్ల మండల పరిధిలో 7 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. ఉదయం 10 నుంచి 12.30 వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్-2 పరీక్ష జరిగింది. మీడియాను సైతం లోనికి అనుమతించలేదు. పలు కేంద్రాల్లో కరెంట్ పోవడంతో ఉక్కపోతలతో అల్లాడిపోయారు.

పరీక్ష కేంద్రాల్లో అధికారులు తనిఖీ..

పరీక్ష కేంద్రాలపై అధికారులు ప్రత్యేకంగా నిఘా పెట్టారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డితో కలిసి పలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఏర్పాట్లను, పరిస్థితులను పరిశీలించారు. 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేశారు. పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పటిష్టంగా పోలీసు బందోబస్తు

శ్రీకాకుళం క్రైమ్ : ఆదివారం జరిగిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. అనంతరం ఎస్పీ జిల్లాకేంద్రంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల, నారాయణ స్కూళ్లను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఐలు సీహెచ్ పైడపునాయుడు, పి.ఈశ్వరరావు బందోబస్తు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

ఎచ్చెర్ల కేంద్రాల్లో ఇలా..

ఎచ్చెర్ల మండలంలో ఏడు పరీక్ష కేంద్రాల్లో ఏపీపీఎస్సీ గ్రూఫ్ -2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్‌సైన్స్, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లా, కామర్స్, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర విద్యా సంస్థల్లో కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పాలిటెక్నిక్, చిలకపాలేంలోని శ్రీ శివానీ ఫార్మసీ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రాలకు 3024 మంది అభ్యర్థులను కేటాయించారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం డివిజన్ ఆర్డీఓ సాయిప్రత్యూష పరిశీలించారు.

85 శాతం మంది పరీక్షకు హాజరు..

ఉదయం సెషన్‌కు 5,535 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 4,715 మంది పరీక్ష రాశారు. 820 మంది గైర్హాజరయ్యారు. 85.18 శాతం అభ్యర్థులు పరీక్ష రాశారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో 5,535 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 4704 మంది పరీక్షకు హాజరయ్యారు. వివిధ కారణాలతో 831 మంది గైర్హాజరయ్యారు. 84.99 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు.



ఆర్ట్స్ కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేసి పంపుతున్న సీఐ ఈశ్వరరావు

పోస్టుల సంఖ్య పెంచాల్సింది..



ప్రస్తుతం రిజర్వేషన్ రోస్టర్ సరి చేసి, ప్రస్తుత ఖాళీలకు అనుగుణంగా మార్పులు చేయాలి. కొన్ని రోజులు వాయి దా వల్ల ఏపీపీఎస్సీ నష్టపోదు. ఎన్నికల కోడ్ అని చెప్పడం న్యాయం కాదు.

– శివరాంకృష్ణ, అభ్యర్థి

ఏపీపీఎస్సీ నిర్ణయం సరికాదు

రోస్టర్ పాటించకుండా గ్రూప్-2 నిర్వహించిన ఏపీపీఎస్సీ నిర్ణయం సరికాదు. కేవలం నియామకాలు వాయిదాలు వేసేందుకే ఈ పన్నాగం. అనాలోచిత నిర్ణయానికి నిరుద్యోగులు బలైపోతున్నారు.

– ఎం.ఆనందసాయి, గ్రూప్-2 అభ్యర్థి శ్రీకాకుళం నగరం,

నమ్మలేకపోతున్నాం..



ప్రభుత్వ ఆదేశాలు ఏపీపీఎస్సీ వినక పోవటం అన్నది నమ్మదగ్గ అంశం కాదు. మెజారిటీ అభ్యర్థుల అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సింది.

– రఘు, అభ్యర్థి

నిరుద్యోగులతో ఆటలా..?

పరీక్ష ఉంటుందా.. ఉండదా అనేది ప్రభుత్వం తరఫు నుంచి అడ్వకేట్ అండ్ జనరల్‌తో ప్రెస్‌మీట్ పెట్టించి మాట్లాడి ఉంటే బాగుండేది. విధానపరమైన లోపం వల్ల నిరుద్యోగులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. నిరుద్యోగులతో ప్రభుత్వాలు ఆటలాడుకోవడం సరికాదు.

– ఐ.నరేష్, గ్రూప్-2 అభ్యర్థి, శ్రీకాకుళం,

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు





శ్రీకాకుళం అర్బన్: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని ఆర్టీసీ డిపోల నుంచి వివిధ శైవ పుణ్య క్షేత్రాలకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నుంచి మహాశివరాత్రికి 60 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా రణస్థలం నుంచి రామతీర్థాలకు 30 ఆర్టీసీ బస్సులు, టెక్కలి నుంచి రావివలసకు 12 బస్సులు, పలాస నుంచి సాబకోటకు 12 బస్సులు, శ్రీముఖలింగానికి 6 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. సాధారణ టికెట్ ధర చెల్లించి ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని, అవసరమైన పక్షంలో భక్తుల రద్దీని బట్టి ఇంకా అదనంగా ఆర్టీసీ బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి, ఆర్టీసీ వారికి ప్రయాణికులు సహకరించాలని కోరారు. తదుపరి ఈ నెల 24వ తేదీన శ్రీకాకుళం నుంచి శ్రీశైలానికి ప్రత్యేకంగా ఒక సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి శ్రీశైలం వెళ్లే ప్రత్యేక సర్వీసునకు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

ఇసుకాసురుల బరితెగింపు





చింతాడ రవికుమార్‌ను అడ్డుకుంటున్న ఇసుకాసురులు (ఇన్‌సెట్) గెడ్డ పారలతో దాడులకు పాల్పడుతున్న దృశ్యం

- అక్రమ ఇసుక ర్యాంపులను పరిశీలించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ రవికుమార్
- ర్యాంపులకు వెళ్లనీయకుండా అడ్డుకున్న టీడీపీ గూండాలు
- దారికి అడ్డుగా ద్విచక్ర వాహనాలు పెట్టి తిరిగి వెళ్లిపోవాలని బెదిరించిన వైనం

పొందూరు: పొందూరు, ఆమదాలవలస మండలాల్లో నిర్వహిస్తున్న అక్రమ ఇసుక ర్యాంపులను పరిశీలించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ను టీడీపీ గూండాలు ఆదివారం అడ్డుకున్నారు. పొందూరు మండలంలోని బొడ్డేపల్లి, ఆమదాలవలస మండలంలోని నెల్లిమెట్ట గ్రామాల్లోని ఇసుక ర్యాంపుల్లోకి వెళ్లనీయకుండా ద్విచక్రవాహనాలను అడ్డుగా పెట్టారు. అక్కడితో ఆగకుండా గెడ్డపారలతో దాడికి దిగి చింతాడ రవికుమార్ ఆయన అనుచరులను భయభ్రాంతులకుగురిచేశారు. ప్రాణాలు కాపాడుకోవాలంటే తిరిగి రాకూడదని హెచ్చరించారు. దీంతో 'ఈ రోజు మీరు అడ్డుకున్నా.. ఇక్కడితో అయిపోయేది కాదు' అని చింతాడ రవికుమార్ ధీటుగా స్పందించారు. అక్కడే విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ తమను అడ్డుకోవడం టీడీపీ దాష్టీకానికి నిదర్శనమని అన్నారు. అనుమతులు లేని ఈ బొడ్డేపల్లి ర్యాంపు నిర్వహణను చూసేందుకు వెళ్తుంటే గూండాలను పెట్టి అడ్డుకుంటున్నారని చెప్పారు. తమ మీద దాడులు చేయడానికి పెద్ద ఎత్తున వచ్చారని తెలిపారు. ఉచిత ఇసుక విధానం ప్రకారం టెండర్‌లు పిలిచి రీచ్‌లు ఏర్పాటు చేయాలని, దీనికి విరుద్ధంగా ఇక్కడ ర్యాంపు జరుగుతోందని తెలిపారు. ఈ ర్యాంపులో మిషన్లు దించేసి రోజుకు 250 నుంచి 300 లారీలు ఇక్కడ నుంచే వెళ్తున్నాయని పేర్కొన్నారు. ఆమదాలవలస మండలంలోని కాఖండ్యాం, ముద్దాడపేట, పురుషోత్తపురం-1, 2, తోటవాడ అనుమతులున్న రీచ్‌ల్లోనే రోజుకు కోట్ల రూపాయలను దోచేస్తున్నారని అన్నారు. రైల్వే బ్రిడ్జిని ఆనుకుని సుమారు వంద మీటర్ల దూరంలోనే ఈ ఇసుక ర్యాంపులను నడుపుతున్నారని అన్నారు. కాఖండ్యాం నుంచి తోటాడ వరకు గల వంశధార, నాగావళి నదుల్లో అక్రమ ఇసుక తవ్వకాలను జరిపిస్తున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాను కచ్చితంగా అడ్డుకుంటామని చెప్పారు. ఈ సమస్యపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తామని, లోకాయుక్తలో కేసు వేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేపల్లి రమణ, చింతాడ ప్రసాద్, గురుగుబెల్లి శేఖర్, పైడి నాగభూషణరావు, తమ్మినేని రవి, అన్నెపు నితిన్, పైడి పోలయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో చంద్రన్న పగ, దగా పథకాలే..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు. చిత్రంలో అరకు ఎంపీ తనూజారాణి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, ధర్మాన కృష్ణదాస్, పార్టీ నేతలు

- కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది
- ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాడుతుంది
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా కన్నబాబు బాధ్యతల స్వీకరణ

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో చంద్రన్న పగ.. చంద్రన్న దగా సంక్షేమ పథకాలే అమలవుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒకటి కూడా పూర్తి స్థాయిలో అమలుచేసిన పాపాన పోలేదని, ఈ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం లేదని పేర్కొన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా బృహత్తరమైన బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాంధ్ర అంటే ఉద్యమాలకు పురిటి గడ్డలాంటిదని, ఈ ప్రాంత ప్రజలు ఉద్యమిస్తే.. సాధించేవరకూ పట్టువదలరని కొనియాడారు. అలాంటి ఈ ప్రాంత అభివృద్ధి కోసం విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా చేసేందుకు అన్నివిధాలా తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేశారన్నారు. ప్రజలకు ఏమైతే మాట ఇస్తారో.. అది చేయడం వైఎస్ జగన్ నైజమన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వారిచ్చిన ప్రతి హామీని అమలుచేసేలా వైఎస్సార్ సీపీ ప్రజల తరఫున పోరాడుతుందని పేర్కొన్నారు. కూటమి 8 నెలల పాలనలో రూ.లక్షా 20 వేల కోట్లు అప్పుచేసిన సీఎం చంద్రబాబు.. ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని సేనల కన్నా వైఎస్ జగన్ సేన స్ట్రాంగ్‌గా ఉందని, ఆయన కోసం ప్రాణాలు ఇచ్చే కోట్లాది మంది కార్యకర్తలు, ప్రజలు, అభిమానులున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఒకరిద్దరు వెళ్లినంత మాత్రాన ఎలాంటి నష్టం లేదన్నారు.

గ్రూప్-2 అభ్యర్థుల యువగళం చూశాం

ఎన్నికలకు ముందు లోకేష్ యువగళమంటూ తిరిగాడు.. అసలుసిసలైన యువగళం విశాఖ కేంద్రంగా గ్రూప్-2 అభ్యర్థులు చేశారని కన్నబాబు అన్నారు. గ్రూప్-2 పరీక్ష వాయిదా వేస్తామంటూ నమ్మించి అభ్యర్థులను చంద్రబాబు మోసం చేశారన్నారు. కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ తనూజరాణి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్ రాజ్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కేకే రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, పీవీ సురేష్, సాడి పద్మారెడ్డి, ఇమ్రాన్, ముఖ్యనేతలు కోలా గురువులు, రొంగల జగన్నాథం, చొక్కాకుల వెంకట్రావ్, మొల్లి అప్పారావు, రవిరెడ్డి, పేర్ల విజయచందర్, కాయల వెంకటరెడ్డి, పేడాడ రమణికుమారి, మారుతీప్రసాద్, బోని శివరామకృష్ణ, శ్రీదేవి వర్మ, మాధవివర్మ, పీలా వెంకటలక్ష్మి, కాళిదాస్ రెడ్డి, సనపల రవీంద్ర భరత్, అల్లంపల్లి రాజుబాబు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీముఖలింగంలో బారికేడ్లు ఏర్పాటు


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు బారికేడ్ల ఏర్పాటు దాదాపు పూర్తయిందని ఈఓ పి.ప్రభాకరరావు ఆదివారం తెలిపారు. ఆలయం లోపల, ఆవరణ, ముందు భాగం, ప్రత్యేక దర్శనాలకు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయం ధ్వజ స్తంభం, వెనుక భాగం,ఉత్తర, దక్షిణ భాగాల వైపు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్వామివారి చక్రతీర్థ స్నానాలకు సంబంధించి నదిలో బారికేడ్ల నిర్మాణం ఏర్పాటు జరుగుతోందన్నారు.

పంచధామ క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రాపురం గ్రామంలో శ్రీ పంచధామ క్షేత్రంలో పంచమ మహా శివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి పోస్టర్, కరపత్రాలను నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు యు.కనకరాజు, నాయకులు కె.హరివరప్రసాద్, కె.ప్రభాకర్, పి.శైలజ, వి.వి జయలక్ష్మి, వి.కామేశ్వరరావు, బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘కూటమి’ ప్రకటన మేధావులను అవమానించడమే


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోతల దుర్గారావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మేధావుల చట్టసభకు సంబంధించి కూటమి ప్రభుత్వం అభ్యర్థిని ప్రకటించడం మేధావుల్ని అవమానపరచడమేనని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో ఆదివారం బహుజన సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా జరగాలని, గతంలో ఎప్పుడూ ఏ పార్టీ అభ్యర్థిని ప్రకటించలేదన్నారు. అందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. అనంతరం ఎన్నికల హామీల పోస్టర్‌ని ఆవిష్కరించారు.

వత్సవలసలో మద్యం బాటిళ్లు పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

గార: మండలంలోని వత్సవలస గ్రామ సమీపంలో ఓ వ్యక్తి నుంచి 10 మద్యం బాటిళ్లు పట్టుకున్నామని ఎక్సైజ్ ఎస్సై బి.రాజేష్ తెలిపారు. ఆదివారం ఉదయం గస్తీ నిర్వహిస్తుండగా వ్యక్తిని అదుపులోకి తీసుకోగా బాటిళ్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

- ఆటో బోల్తా..పలువురికి గాయాలు



మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం –మెళియాపుట్టి గ్రామాల మధ్య ఓ ఆటో బోల్తాపడటంతో పలువురు గాయపడ్డారు. గార మండలం అరికిపేట గ్రామస్తులు ఆదివారం మెళియాపుట్టి మండలంలో పెళ్లిచూపులకు హాజరై తిరిగి వస్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కృష్ణారావు, అప్పలనాయుడు తీవ్ర గాయాలు కాగా.. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెళియాపుట్టి పీహెచ్‌సీలో చికిత్స అందించి మెరుగైన వైద్యసేవల కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వ్యాపారాలు చిక్కేను!


కొనుగోలుదారులు లేక వెలవెలబోయిన చికెన్‌షాపు

- జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేకపోయినా పడిపోయిన చికెన్ అమ్మకాలు
- లబోదిబోమంటున్న చికెన్ సెంటర్ నిర్వాహకులు
- హోటల్స్, రెస్టారెంట్లదీ అదే పరిస్థితి
- నిర్భయంగా చికెన్ తినవచ్చంటున్న అధికారులు


మటన్‌షాపు వద్ద గుమిగూడిన జనాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కరోనా తరువాత మాంసప్రియులు ఎక్కువయ్యారు. కోళ్లఫారాలు, హోటల్స్ రంగంలో వ్యాపారాలు బాగా పెరిగాయి. అయితే రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో బర్డ్ ఫ్లూ ప్రభావం ఉందనడంతో 20 రోజులుగా చాలామంది చికెన్, గుడ్లు తినడం మానేశారు. శ్రీకాకుళం జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ లేదని పశుసంవర్ధకశాఖ అధికారులు, వైద్యులు, నిపుణులు చెబుతున్నా మాంసం తినేందుకు అంత ఆసక్తి చూపడం లేదు. దీంతో హోటల్స్ యజమానులు, చికెన్ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు కుదేలవుతున్నారు. హోటల్స్, రెస్టారెంట్లకు వెళ్లే వారు కూడా మటన్, ప్రాన్ బిర్యానీలకే మొగ్గుచూపుతున్నారని యజమానులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చికెన్ తినడం వల్ల ఎటువంటి నష్టం లేదని చెప్పేందుకు పౌల్ట్రీ వ్యాపారులు ఎక్కడికక్కడ స్టాల్స్ పెట్టి ఉచితంగా చికెన్ పకోడీ, బాయిల్డ్ ఎగ్ ఇచ్చి ప్రాక్టికల్‌గా తిని చూపిస్తున్నారు.

పడిపోయిన అమ్మకాలు..

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ లేనప్పుడు జిల్లాలో రోజుకు సరాసరి రెండున్నర లక్షల కేజీ చికెన్ అమ్మకాలు జరిగేవి. కిలో ధర రూ.240 ఉన్నప్పుడు సుమారు రూ.6కోట్లు వ్యాపారం జరిగేది. ఇప్పుడు జిల్లా అంతా కలిపి 30 వేల కేజీలు కూడా అమ్మకం జరగడం లేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. గత 20 రోజులుగా పౌల్ట్రీ రంగంలో ఒక్క మన జిల్లాలోనే రూ.70కోట్లు నష్టం ఉంటుందని చెబుతున్నారు. ఓ చిన్న చికెన్ షాపులో సాధారణంగా ఆదివారం 100 నుంచి 150 కేజీలు అమ్మకాలు జరిగేవి. ఇప్పుడా ట్టుమని 10 కేజీలు కూడా అమ్మలేకపోతున్నామని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుదేలైన హోటల్ రంగం:

సాధారణంగా హోటల్, రెస్టారెంట్లలో భోజనం చేసేవారు ఎక్కువగా ఆర్డర్ ఇచ్చేది నాన్ వెజ్ వంటకాలే. అందులో చికెన్‌తో వండే ఆహార పదార్థాలకే పెద్దపీట. ఇప్పుడు బర్డ్‌ఫ్లూ ప్రచారంతో చాలామంది హోటల్స్‌కు వెళ్లడం మానేశారు. ఒకవేళ వెళ్లినా శాకాహార వంటకాలు, రొయ్యలు, చేపలు, మటన్‌తో తయారుచేసే ఆహార పదార్థాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా హోటల్స్ నష్టాలు చవిచూస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు చిన్న, పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, దాబాలు వెయ్యికిపైగా ఉంటాయి. రోజుకి తక్కువలో తక్కువ రూ.20వేలు నుంచి రూ.లక్ష వరకు వ్యాపారం జరిగేది. చికెన్ బిర్యాన్స్, ఎగ్ ఐటమ్స్ తినకపోవడం వల్ల కనీసం 10 వేలు రూపాయల వ్యాపారం కూడా జరగడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ఓ రెస్టారెంట్‌లో రోజుకు 20 కేజీల ధమ్‌బిర్యానీ తయారుచేస్తే మళ్లీ రెండోసారి వండాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు రెండు కేజీలు బిర్యానీ వండినా అమ్మడం కష్టమైపోతోంది. హోటల్ తెరిస్తే విద్యుత్ చార్జీలు, భవనం అద్దె, కూలీలు, కుక్ వంటి మెయింటెనెన్స్‌తో కలిపి సుమారు రూ.30వేలు ఖర్చవుతుంది. పట్టుమని రూ.పది వేలు వ్యాపారం కూడా జరగకపోతే హోటళ్లను ఎలా నడిపించగలమని వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

ఉచితంగా చికెన్ పకోడి, గుడ్లు పంపిణీ


ఉచితంగా చికెన్ పకోడి, గుడ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చికెన్, ఎగ్ తినడం వల్ల ఎటువంటి ఇబ్బందులు లేవని, జిల్లాలో ఎటువంటి బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని పశుసంవర్ధక శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ మెట్ట వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీకాకుళం పాతబస్టాండ్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో వెన్‌కాబ్ ఆధ్వర్యంలో ఆదివారం చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. ఉచితంగా చికెన్ పకోడీ, ఉడికించిన గుడ్డును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో 100 డిగ్రీ సెల్సియస్‌లలో మాంసం ఉడికిస్తామని, ఈ పరిస్థితుల్లో ఎటువంటి బర్డ్‌ఫ్లూ రాదన్నారు. ప్రజల్లో చికెన్‌పై భయం పోగొట్టేందుకే మేళా నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్రాయిలర్ ఫార్మర్స్ అండ్ బ్రీడర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వెన్‌కాబ్ మేనేజర్ గణేష్, డాక్టర్ శ్రీనివాసరావు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

చక్కగా తినొచ్చు..



బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ శ్రీకాకుళం జిల్లాలో అస్సలు లేదు. మిగిలిన జిల్లాలో కూడా బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ తగ్గుముఖం పట్టింది. ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదు. భారతీయ వంటల విధానం ప్రకారం 100 డిగ్రీల సెంటిగ్రేడ్‌లో వంటకాలు చేస్తుంటాం కాబట్టి ఎటువంటి ఎఫెక్ట్ ఉండదు. కోళ్ల రైతులు కూడా కొత్త బ్యాచ్‌లు వేసుకోవాలి.

– డాక్టర్ కె.రాజగోపాలరావు, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు

ఆదుకోవాలి..



హోటళ్లో గతంలో చికెన్ వంటకాలకు సంబంధించి రూ.40వేలు పైగా వ్యాపారమైతే ఇప్పుడు రూ.పది వేలు అమ్మడం కష్టమైపోతోంది. అద్దెలు చెల్లించలేక, చెఫ్‌లు, కూలీల చార్జీలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికే చాలా హోటల్స్ తాత్కాలికంగా మూతపడ్డాయి. ప్రభుత్వం స్పందించి హోటల్స్ రంగాన్ని ఆదుకోవాలి.

– మెట్ట నాగరాజు, హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాకుళం

వ్యాపారాల్లేవ్..



చికెన్ అమ్మకాలు ప్రతి ఆదివారం 100 నుంచి 150 కేజీలు అమ్మకాలు జరిగేవి. మూడు వారాలుగా రోజంతా కలిసి 20 కేజీలు అమ్మడం కష్టమైపోతోంది. ఈ నెల విద్యుత్‌చార్జీలైనా వస్తాయో రావో అనుమానంగా ఉంది. గత 20 రోజులుగా వ్యాపారాలు లేక అద్దెలు చెల్లించలేక మెయింటెనెన్స్ కూడా ఇబ్బందిగా మారింది. ఇదే పరిస్థితి కొనసాగితే షాపు మూసేయాల్సిందే.

– గ్రంధి జగదీష్, చికెన్ షాపు యజమాని, హోమియోనగర్, శ్రీకాకుళం

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

- త్వరలో సీఎంను కలుస్తాం
- విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ


ప్రసంగిస్తున్న విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ

విశాఖ–లీగల్: విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని విశాఖ న్యాయవాదుల సంఘం ఆవరణలో ఆరు జిల్లాల న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యాయవాదులందరూ విశాఖకు హైకోర్టు బెంచ్, కేంద్ర పారిశ్రామిక ట్రిబ్యునల్ ఏర్పాటుకు ముందడుగు వేయాలని నిర్ణయించారు. శ్రీకాకుళం, పార్వతీపురం వంటి సుదూర ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్లాలంటే చాలా భారంగా ఉందని న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ అన్ని రకాలుగా మోసానికి గురైందని వెల్లడించారు. అంతర్జాతీయ ఖ్యాతిని గడిస్తున్న విశాఖకు హైకోర్టు బెంచ్ కేటాయించడం అన్ని విధాల శ్రేయోదాయకమన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి. నరసింహారావు మాట్లాడుతూ విశాఖలో హైకోర్టు ఏర్పాటు సంబంధించి న్యాయశాఖకు అభ్యంతరాలు ఉండకపోవచ్చన్నారు. 1993లో హైకోర్టుమెంట్ సాధనకు న్యాయవాదులు చేసిన ఉద్యమాలను గుర్తు చేస్తూ భవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యంతో పోరాడతామన్నారు. సోమవారం నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి న్యాయస్థానానికి హాజరవుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, ఏవీ పార్వతీశం, కృష్ణ శేఖర్, పూర్వ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, పాలకొండ, బొబ్బిలి, రాజాం, గజపతినగరం, అనకాపల్లి, చోడవరం, తుని, యలమంచిలి, విజయనగరం, ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు ఈ సదస్సులో పాల్గొన్నారు. న్యాయవాద సంఘం కార్యదర్శి డి.నరేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.


ఆరు జిల్లాల నుంచి హాజరైన న్యాయవాదులు

యువకుడు ఆత్మహత్యాయత్నం

టెక్కలి : కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ బాపన్నపేట గ్రామానికి చెందిన దుంపల వాసుదేవరావు (24) ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వాసుదేవరావు గత ఏడాది డిసెంబర్ 18న సీమెన్ ఉద్యోగం కోసం ముంబై వెళ్లాడు. అక్కడ అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం కొన్ని మందులు తీసుకొని ఇంటికి చేరాడు. అందరితో కలిసిమెలిసి తిరుగుతూ ఆదివారం ఉదయం నరసన్నపేటలో ఒక రోగిని పరామర్శించి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. పొలానికి వినియోగించిన మిగిలిన పురుగుల మందును తండ్రి అప్పన్న ఇంట్లో దాచి పెట్టాడు. ఇంటికి చేరిన వాసుదేవరావు ఆ మందు తాగుతుండగా తల్లి లక్ష్మి గమనించి డబ్బా లాక్కొంది. వెంటనే ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటినా కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి డ్రైవర్ మృతి


మృతి చెందిన మార్కండరావు

టెక్కలి రూరల్ : ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ ప్రమాదవశాత్తు జారిపడటంతో దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెళియాపుట్టి మండలం బంజీరు గ్రామానికి చెందిన గూడ మార్కండరావు(33) టెక్కలి జూనియర్ కళాశాల మైదానంలో నిల సివిల్‌సప్లయ్ ఎంఎల్‌ఎస్ గొడౌన్‌లో బియ్యం రవాణా చేసే ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ట్రాక్టర్‌లో బియ్యం లోడు వేసుకుని నందిగాం మండలంలో అన్‌లోడ్ చేశాడు. తిరిగివస్తుండగా టెక్కలి సమీప పాత రవి దాబా వద్ద అప్రోచ్ రోడ్డులోకి తిరుగుతున్న సమయంలో ఉమ్మి ఊస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మార్కండరావుకు భార్య, పిల్లలు ఉన్నారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శ్రీకాకుళానికి చెందిన నూకాలు సూర్యకాంతం రూ.లక్ష 1,116 విరాళాన్ని నగదు రూపంలో ఆదివారం అందించారు. దేవస్థానం తరపున ప్రొటోకాల్ ఏఈవో రాంబాబు దాతకు బాండ్ ఇచ్చారు.

స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందించారు. ప్రొటోకాల్ జూనియర్ అసిస్టెంట్ రౌతు వరాహనరసింహం పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య


వజ్జ రమణమూర్తి (ఫైల్)

గార: మండలంలోని కొర్ని గ్రామానికి చెందిన రైతు వజ్జ రమణమూర్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. రమణమూర్తి (37) వ్యవసాయం చేసుకుంటూనే అప్పుడప్పుడు ఉపాధి హామీ పనులకు వెళ్తుండేవాడు. ఏం జరిగిందో గానీ శనివారం సాయంత్రం నుంచి కనిపించలేదు. భార్య భాగ్యలక్ష్మి ఆందోళనకు గురై గ్రామస్తుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని తోటలో చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రమణమూర్తికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నా. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గార ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగమవుదాం


ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ప్లీనరీలో నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఐక్యవేదిక ప్రతినిధులు పుట్టా సురేంద్ర బాబు, డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక 2వ రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం శ్రీకాకుళం నగరంలోని కాళింగ సామాజిక భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు మంచాల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకమని స్పష్టం చేశారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణమైన పద్ధతుల్లో ఎన్నికలు నిర్వహించుకోలేకపోతే పాలనలో ప్రజల పాత్ర తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. స్థానిక సంస్థలకు వచ్చే నిధులు వెచ్చించే అధికారం ఆయా సంస్థలకే ఇవ్వాలని కోరారు. ప్రజాస్వామ్యం ప్రత్యక్షంగా అమలు జరిగేది గ్రామ, వార్డు సభల్లోనేనని, ఏడాదికి నాలుగు సార్లు జరిగే గ్రామసభల్లో ఓటర్లు అందరూ హాజరై అభివృద్ధి, అవసరమైన కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేసుకోవడం పౌరుల బాధ్యతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జై భారత్ వ్యవస్థాపకులు విజయ విహారం రమణమూర్తి, ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్ష, కోశాధికారులు కె.వి.ఆర్.వి.ప్రసాద్, జె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రహీం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉంగటి వెంకటరమణమూర్తి, కమిలి రాజేష్, కోర్ కమిటీ సభ్యులు పారేపల్లి సత్యనారాయణ, లోక్‌నాథ్, కోట శివప్రసాద్, ప్రసంగి ఆదినారాయణ, వేమగిరి సన్యాసిరావు, జిల్లా ప్రతినిధులు ధర్మారావు, శ్రీహరి, మండపల్లి రామకృష్ణ, కె.అప్పలరాజు, నాగరాజు, వివిధ జిల్లాల ఐక్యవేదిక అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయానికి పోటెత్తిన భక్తజనం


అరసవల్లి ఆలయం ముందు భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాఘమాసం మూడో ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో అరసవల్లి ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. ఇంద్రపుష్కరిణి వద్ద సంప్రదాయబద్ధంగా మహిళలు క్షీరాన్నాన్ని వండి స్వామికి నివేదించారు. అంతరాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి.. ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతించేలా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు. భారీగా భక్తులు తరలిరావడంతో ఎండ వేడిమి నుంచి రక్షణ కోసం ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో చలువ పందిళ్లు వేయించి ఉచితంగా మంచినీటిని సరఫరా చేశారు. ఒక్క రోజులో వివిధ దర్శన మార్గాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.8,09,600, విరాళాలు, ప్రత్యేక పూజల ద్వారా రూ.1,34,906, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.55 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈఓ వెల్లడించారు. అలాగే ఐఏఎస్ అధికారి సుబ్బారావు కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, ప్రధానార్చకులు శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఇక వత్సవలస రాజమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆ ప్రభావం అరసవల్లి ఆలయ దర్శనాల్లో కనిపించింది. దీంతో సాయంత్రం వరకు భక్తుల తాకిడి అరసవల్లి క్షేత్రంలో కనిపించింది.


పుష్కరిణి ఒడ్డున క్షీరాన్నం వండుతున్న మహిళలు


ఐఏఎస్ అధికారి సుబ్బారావుకు జ్ఞాపిక అందజేస్తున్న కనకరాజు, శంకరశర్మ

31 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు అక్రమంగా గంజాయి తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కొడల పీఎస్ పరిధిలోని నాయికనిపల్లి గ్రామానికి చెందిన ఉపేంద్ర స్వైన్, అదే గ్రామానికి చెందిన గౌడ సాహిలు వ్యసనాలకు బానిసయ్యారు. కుటుంబ పోషణకు గంజాయిని అక్రమ రవాణా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో కొడల గ్రామానికి చెందిన దీపక్ అనే వ్యక్తి నుంచి 31.110 కేజీల గంజాయిని తీసుకొని గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో దీపక్ సూచించిన వ్యక్తికి అందజేయడానికి బయలుదేరారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు శనివారం సాయంత్రం చేరుకున్నారు. ఇద్దరూ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేశారు. 31.110 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. గంజాయి అక్రమరవాణ జరగకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్న ఇచ్ఛాపురం సర్కిల్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.